

PRGI - TGTEL/25/A0348

జాతీయ తెలుగు దినపత్రిక

Published by
తెలంగాణ - ఆంధ్ర ప్రదేశ్

సందేశం టైమ్స్

నిజం దాగదు - వార్త ఆగదు



మంగళవారం 26 అక్టోబర్ 2026	పేజీలు : 08	వెల : 2/-	సంపుటి: 02 . సంచిక : 146	ప్రచురణ : సూర్యాపేట	ఎడిటర్ : శెట్టి వెంకటేష్

కుమ్రం భీమ్ పోరాట స్ఫూర్తితో గిరిజన సంక్షేమానికి కృషి,జల్–జంగల్–జమీన్ హక్కుల కోసం ఆయన పోరాటం చిరస్మరణీయం: సంతోష్ బి.ఎం., ఐఏఎస్



హైదరాబాద్, అక్టోబర్ 27 – సందేశం టైమ్స్ ప్రతినిధి: కుమ్రం భీమ్ వర్ధంతిని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని నెహ్రూ శతజయంతి గిరిజన మ్యూజియంలో నిర్వహించిన కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి, సంచాలకులు సంతోష్ బి.ఎం., ఐఏఎస్ ముఖ్య అతిథిగా పాల్గొని కుమ్రం భీమ్ విగ్రహానికి పూలమాల వేసి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుమ్రం భీమ్ పోరాట స్ఫూర్తిని స్మరించుకున్న ఆయన మాట్లాడుతూ జల్, జంగల్, జమీన్‌పై గిరిజనుల హక్కుల పరిరక్షణ కోసం కుమ్రం భీమ్ సాగించిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. ఆయన పోరాట స్ఫూర్తితోనే నేటి ప్రభుత్వాలు గిరిజన సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్నాయని, అదే స్ఫూర్తితో మరింత బాధ్యతాయుతంగా పనిచేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. గిరిజన బాలబాలికలందరికీ నాణ్యమైన విద్య అందించడంతో పాటు గిరిజన ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయాలు, కనీస మౌలిక వసతులు కల్పించడం ద్వారా కుమ్రం భీమ్ త్యాగం, ఆశయాలను సాకారం చేయగలమన్నారు. గిరిజనుల సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కంకణబద్ధులై పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ అదనపు సంచాలకులు వి. సర్వేశ్వర రెడ్డి, ట్రైబల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ డా. వి. సముజ్వల, గిరిజన మ్యూజియంల సంరక్షకులు డా. సత్యనారాయణ ద్యావనపల్లి, గిరిజన సంక్షేమ శాఖ చీఫ్ ఇంజినీర్ బాలు, ఎస్సీ హేమలత, సహ సంచాలకులు విజయలక్ష్మి తదితర ఉన్నతాధికారులు, శాఖ ఉద్యోగులు పాల్గొని కుమ్రం భీమ్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు.



వరి వద్దు.. ఆరుతడి పంటలే ముద్దు!

హైదరాబాద్, అక్టోబర్ 27 – సందేశం టైమ్స్ ప్రతినిధి: ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రైతులు ఈ యాసంగిలో తక్కువ నీటితో సాగయ్యే ఆరుతడి పంటలకు ప్రాధాన్యం ఇవ్వాలని, వరి సాగును తగ్గించాలని వ్యవసాయ శాఖ సంచాలకులు డా. బి. గోపి, ఐఎఎస్ సూచించారు. 'భేత్ బచావో అభియాన్'లో భాగంగా రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం దుబ్బచెర్ల గ్రామంలో సోమవారం క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించిన ఆయన రైతులతో నేరుగా మాట్లాడారు. ఈ వానాకాలంలో ఆశించిన స్థాయిలో వర్షాలు లేకపోవడం, జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గడం, భూగర్భ జలాలు అడుగంటుతున్న నేపథ్యంలో రానున్న వేసవిలో ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉండే అవకాశాలున్నాయని తెలిపారు. అందువల్ల రైతులు తక్కువ నీటితో, తక్కువ కాలంలో చేతికొచ్చే మధ్యంతి, నూనెగింజల పంటలను సాగు చేయాలని సూచించారు. మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్న కూరగాయలు, పండ్ల తోటల సాగుపై దృష్టి సారించాలని, అంతర్జాతీయంగా గిరాకీ ఉన్న ఆయిల్‌పామ్ సాగును కూడా చేపట్టాలని సూచించారు. హైదరాబాద్‌కు రంగారెడ్డి జిల్లా సమీపంలో ఉండటంతో స్థానికంగా పండించే కూరగాయలకు మంచి మార్కెట్ అవకాశాలు ఉన్నాయని, డిమాండ్ ఉన్న పంటలను ఎంపిక చేసుకుంటే రైతులు అధిక ఆదాయం పొందవచ్చని వివరించారు. పశునంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని, పశుగ్రాసం కొరత తలెత్తకుండా స్వల్పకాలిక పశుగ్రాస పంటలను సాగు చేయాలని పిలుపునిచ్చారు. పంటల సాగులో నేల సంరక్షణ అత్యంత కీలకమని, నేలను కాపాడుకుంటేనే దిగుబడులు, రైతుల ఆదాయం పెరుగుతాయని, భావితరాలకు సాగుయోగ్యమైన భూమిని అందించగలమని తెలిపారు. సమగ్ర నస్యరక్షణ, సమగ్ర పోషక యాజమాన్య పద్ధతులను పాటిస్తూ వ్యవసాయ శాస్త్రవేత్తలు సిఫార్సు చేసిన మేరకే ఎరువులు, పురుగుమందులు వినియోగించాలని సూచించారు. భూసార పరీక్షల ఆధారంగా అవసరమైన మేరకే రసాయనాలను వినియోగిస్తూ క్రమంగా వాటిపై ఆధారపడటాన్ని తగ్గించుకోవడం రైతులతో పాటు నేలకు కూడా మేలు చేస్తుందన్నారు. విశాల



మెదక్ జిల్లాలో ఘనంగా శ్రీ వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు

మెదక్, అక్టోబర్ 27 (సందేశం టైమ్స్ ప్రతినిధి): మెదక్ జిల్లాలో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శ్రీ వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన జీవితం, ఆదర్శాలు, సమాజానికి అందించిన సేవలను స్మరించుకున్నారు. మహర్షి రచించిన రామాయణం మానవాళికి ధర్మం, సత్యం, న్యాయం, నైతిక విలువలను బోధించే మహత్తర ఇతిహాసమని పేర్కొన్నారు. వాల్మీకి మహర్షి చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడుస్తూ సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆయన ఆశయాలను భావితరాలకు అందించడంతో పాటు వెనుకబడిన తరగతుల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారులు, వాల్మీకి సంఘం ప్రతినిధులు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.







కరువు కోరల్లో రైతాంగం.. ప్రభుత్వం ఏం చేస్తోంది?

చింతకాని, అక్టోబర్ 27 – సందేశం టైమ్స్ ప్రతినిధి: తెలంగాణలో నెలకొన్న కరువు పరిస్థితులతో రైతాంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ప్రభుత్వం తక్షణమే స్పందించి రైతులకు ఆర్థిక సహాయం అందించాలని, రైతుల సమస్యలపై చర్చించేందుకు అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని సీపీఎం ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. చింతకాని మండల పరిధిలోని నాగుపంచ గ్రామంలో రైతు సంఘం నాయకుడు మద్దినేని బసవయ్య అధ్యక్షతన నిర్వహించిన సీపీఎం మండల కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పంటల సాగు కోసం అప్పులు చేసి పెట్టుబడులు పెట్టిన రైతులు వర్షాభావ పరిస్థితులతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇలాంటి సమయంలో ప్రభుత్వం వారికి అండగా నిలవాల్సిన బాధ్యత ఉందని పేర్కొన్నారు. కరువు పరిస్థితులపై అన్ని రాజకీయ పార్టీలు, రైతు సంఘాలు, వ్యవసాయ రంగ ప్రతినిధులతో అఖిలపక్ష సమావేశం నిర్వహించి రైతులను ఆదుకునేందుకు తీసుకోబోయే చర్యలపై స్పష్టమైన ప్రకటన చేయాలని కోరారు. పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం ఎప్పుడు అందిస్తారు, పెట్టుబడి సాయం ఎలా కల్పిస్తారు, సాగునీటి సదుపాయాల మెరుగుదలకు ఎలాంటి చర్యలు తీసుకుంటారనే అంశాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేవలం హామీలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో కార్యాచరణ చేపట్టి రైతులకు భరోసా కల్పించాలని సూచించారు. కరువు ప్రభావిత ప్రాంతాల్లో పంట నష్టాన్ని అంచనా వేసి అర్హులైన రైతులందరికీ పరిహారం అందించాలని, పశువుల మేత, తాగునీటి కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అన్నారు. సాగు కోసం చేసిన అప్పుల భారంతో సతమతమవుతున్న రైతులకు బ్యాంకు రుణాల విషయంలో ఉపశమనం కల్పించాలని కోరారు. వ్యవసాయ అధికారులు గ్రామాలవారీగా పంటల పరిస్థితులను పరిశీలించి వాస్తవ నష్టాలను అంచనా వేయాలని, కరువు ప్రభావిత ప్రాంతాలను గుర్తించి పరిహారం, ఆర్థిక సహాయం, ఇతర ఉపశమన చర్యల వివరాలను ప్రభుత్వం బహిరంగంగా వెల్లడించాలని పేర్కొన్నారు. రైతాంగం సమస్యల పరిష్కారంలో జాప్యం చేయకుండా తక్షణమే స్పందించి, ప్రకటించే సహాయాన్ని ఆలస్యం లేకుండా రైతులకు అందించాలని నున్నా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మధిర డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాలరావు, సీపీఎం సీనియర్ నాయకులు పొన్న వెంకటేశ్వరరావు, మండల కార్యదర్శి దేశబోయిన ఉపేందర్, సీనియర్ నాయకులు వచ్చాయి జానకిరాములు, మండల కమిటీ సభ్యులు తోటకూర వెంకట నర్సయ్య, మద్దినేని బసవయ్య, ఆళ్ల మాధవరావు, కాటబత్తిని వీరబాబు, ఓబి అచ్చయ్య, పులి ఎగ్ నారాయణ, లింగం కోటి, సీతారామరెడ్డి, కంద బోస్, గడ్డం కోటేశ్వరరావు, రౌత్ అప్పారావు, నరేష్, నక్కనబోయిన శాంతారావు తదితరులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు మాజీ సీజేఐ చేతుల మీదుగా భావనకు అవార్డు





అందోల్, అక్టోబర్ 27 – సందేశం టైమ్స్ ప్రతినిధి: జాతీయ స్థాయిలో రెండో ర్యాంకు సాధించి ప్రతిభ చాటిన సంగారెడ్డి జిల్లా అందోల్ మండలం నేరడిగుంట గ్రామానికి చెందిన పట్లోళ్ల భావన ముంబైలోని ఎంఐటీ వరల్డ్ పీస్ యూనివర్సిటీ వార్షికోత్సవంలో బెస్ట్ పెర్ఫార్మెన్స్ అవార్డును అందుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉదయ్ ఉమేష్ లలిత్, గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్, యూనివర్సిటీ వ్యవస్థాపకుడు విశ్వనాథ్ కరాడ్ చేతుల మీదుగా భావన అవార్డును స్వీకరించారు. నేరడిగుంట గ్రామానికి చెందిన పట్లోళ్ల మహేశ్వరి, వైద్యనాథ్ (రాజు) దంపతుల కుమార్తె అయిన భావన ప్రస్తుతం యూనివర్సిటీలో ఇంజినీరింగ్ విద్యను అభ్యసిస్తూ జాతీయ స్థాయిలో రెండో ర్యాంకు సాధించడం పట్ల కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. తమ కుమార్తె సాధించిన విజయంతో ఎంతో గర్వంగా ఉందని తల్లిదండ్రులు మహేశ్వరి, రాజు పటేల్ తెలిపారు. పిల్లలు ఉన్నత స్థానాలకు ఎదిగి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావడమే వారి జీవితానికి సార్థకత అని పేర్కొన్నారు. తమ అమ్మమ్మ చంద్రమ్మ, తాత నాగిశెట్టి ఆశీస్సులతో పాటు ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తూ అండగా నిలుస్తున్న నేరడిగుంట గ్రామ ప్రజల సహకారం, ఆశీస్సులు కూడా భావన విజయానికి తోడ్పడ్డాయని వారు తెలిపారు. తమ గ్రామానికి చెందిన యువతి ప్రతిష్ఠాత్మక అవార్డును అందుకోవడంతో నేరడిగుంట గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. భావన భవిష్యత్తులో అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించి గ్రామానికి, రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.



స్వచ్ఛ గ్రామమే లక్ష్యం.. దరఖాస్తుపల్లిలో మరోసారి గడ్డిమందు పిచికారీ

వట్పల్లి, అక్టోబర్ 28 – సందేశం టైమ్స్ ప్రతినిధి: గ్రామాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యకరమైన వాతావరణంతో తీర్చిదిద్దడమే లక్ష్యంగా సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండలం దరఖాస్తుపల్లిలో గ్రామ సర్పంచ్ కె. సురేఖ, సత్యనారాయణ గౌడ్ ఆధ్వర్యంలో వీధుల్లో రెండోసారి గడ్డిమందు పిచికారీ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని వీధులు, బహిరంగ ప్రదేశాల్లో పెరిగిన పిచ్చిమొక్కలు, గడ్డిని నియంత్రించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. స్వచ్ఛభారత్ లక్ష్యాలకు అనుగుణంగా గ్రామంలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచేందుకు గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పరిశుభ్రమైన పరిసరాలతో గ్రామంలో ఆరోగ్యకరమైన వాతావరణాన్ని నెలకొల్పేందుకు ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని పేర్కొన్నారు. గ్రామ ప్రజలు తమ ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు గ్రామపంచాయతీ చేపడుతున్న పారిశుద్ధ్య కార్యక్రమాలకు సహకరించాలని సర్పంచ్ కోరారు.

పోలీసు అమరవీరుల త్యాగాలకు గుర్తుగా రక్తదాన శిబిరం.. 150 మందికి పైగా రక్తదానం





నూర్యాపేట, అక్టోబర్ 27 (సందేశం టైమ్స్ జిల్లా కోఆర్డినేటర్ సోమయ్య కంభంపాటి): రక్తదానం ప్రాణదానంతో సమానమని, అత్యవసర సమయాల్లో ప్రమాదాల్లో గాయపడిన క్షతగాత్రులతో పాటు వివిధ వ్యాధులతో బాధపడుతున్న వారికి రక్తం ఎంతో ఉపయోగపడుతుందని నూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ కార్యక్రమాల్లో భాగంగా అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ నరసింహ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ స్వయంగా మొదట రక్తదానం చేసి శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం డీఎస్పీ నరసింహాచారి, నాగారం సీఐ నాగేశ్వరరావు, సీఐలు రామారావు, శివకుమార్, ఆర్ఐలు ప్రవీణ్ కుమార్, జానయ్య, ఎస్ఐలు, ఇతర పోలీసు సిబ్బంది రక్తదానం చేశారు. పోలీసు సిబ్బందితోపాటు ఆటో యూనియన్ సభ్యులు, యువత, స్థానిక పారులు ఉత్సాహంగా పాల్గొని 150 మందికి పైగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ నరసింహ మాట్లాడుతూ పోలీసు అమరవీరుల త్యాగాలకు గుర్తుగా ఈ రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశామని, ప్రజాసేవలో పోలీసులు ఎల్లప్పుడూ ముందుంటారని తెలిపారు. అత్యవసర సమయాల్లో ప్రజలకు అండగా నిలవడంతోపాటు ప్రాణాలను కాపాడేందుకు అవసరమైన సహాయాన్ని అందించడంలో పోలీసులు తమ వంతు కృషి చేస్తారని పేర్కొన్నారు. ప్రమాదాల్లో గాయపడిన వారికి సకాలంలో రక్తం అందక ప్రాణనష్టం సంభవించే పరిస్థితులు ఎదురవుతున్నాయని, అలాంటి పరిస్థితులను నివారించేందుకు రక్తదానం ఎంతో అవసరమని అన్నారు. యువత పెద్ద సంఖ్యలో ముందుకొచ్చి రక్తదానం చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ఖమ్మంకు చెందిన తలసేమియా, సికిల్ సెల్ సొసైటీ ప్రతినిధులు కూడా ఈ శిబిరంలో పాల్గొని తలసేమియా, సికిల్ సెల్ వ్యాధులతో బాధపడుతున్న పిల్లలకు ఉపయోగపడేలా రక్తాన్ని సేకరించారు. రక్తదానం ద్వారా ఆపదలో ఉన్నవారి ప్రాణాలను కాపాడవచ్చని, ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానానికి ముందుకు రావాలని ఎస్పీ పిలుపునిచ్చారు. పోలీసు అమరవీరుల త్యాగాలను ప్రజలు గుర్తించాలని, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, ఏఆర్ డీఎస్పీ నరసింహాచారి, సీఐలు రాజశేఖర, నాగేశ్వరరావు, వెంకటయ్య, రామారావు, శివకుమార్, ఆర్ఐలు ప్రవీణ్ కుమార్, జానయ్య, పోలీసు సంఘం అధ్యక్షుడు రమేష్, కార్యదర్శి కిరణ్, సంఘం సభ్యులు, స్థానిక పారులు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఉద్యమకారుల హామీల అమలుకు రామ్ సైదులు డిమాండ్

హుజూర్‌నగర్, అక్టోబర్ 27 – సందేశం టైమ్స్ నూర్యాపేట జిల్లా కోఆర్డినేటర్ సోమయ్య కంభంపాటి: తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ జిల్లా నాయకుడు రామ్ సైదులు విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇంటి ముట్టడికి వెళ్తున్న మలిదశ తెలంగాణ ఉద్యమకారులను అరెస్టు చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023 ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ ఉద్యమకారులకు ప్రతి ఒక్కరికీ 250 గజాల ఇంటి స్థలంతో పాటు ఇల్లు, నెలకు రూ.25 వేల పింఛన్, ఉచిత బస్సు పాస్, వారి పిల్లలకు ఉద్యోగాల్లో ప్రత్యేక రిజర్వేషన్, ఆరోగ్య భద్రత కార్డు అందిస్తామని హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. తెలంగాణ ఉద్యమంలో అమరులైన మలిదశ ఉద్యమకారుల కుటుంబాలకు రూ.25 లక్షల ఆర్థిక సహాయం, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తామని ప్రకటించినప్పటికీ ఇప్పటివరకు ఆ హామీలు అమలుకు నోచుకోలేదని ఆరోపించారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమకారులు తమ యవ్వనాన్ని, ఉద్యోగాలను, భవిష్యత్తును, కుటుంబాలను సైతం పక్కనపెట్టి పోరాడారని, ప్రాణాలను పణంగా పెట్టి సాధించిన రాష్ట్రంలో వారికి కనీస గుర్తింపు లభించకపోవడం బాధాకరమని అన్నారు. ఉద్యమకారులు పదవుల కోసం కాకుండా ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా ఉద్యమించారని స్పష్టం చేశారు. తమకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ ఆందోళనకు దిగిన వారిని అరెస్టు చేయడం సమంజసం కాదని పేర్కొన్నారు. అరెస్టులు, కేసులకు ఉద్యమకారులు భయపడరని, ప్రభుత్వం వెంటనే స్పందించి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమకారుల ఐక్య పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మలిదశ తెలంగాణ ఉద్యమకారులు, హుజూర్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్లు పిడమర్తి అంజి, గూగులోతు హైమా నాయక్, అనంత చంద్రయ్య, నందిపాటి ప్రభాకర్, బచ్చలకూరి కోటయ్య, గుండు రమేష్, చింతమల వరకుమార్, గుండు వీరబాబు, వేములూరు నాగేంద్రచారి, గోపాల్ దాస్ హుస్సేన్, అమర్ గాని లక్ష్మణ్, చింతమల అశోక్, నరేందర్ నాయక్, రవీంద్ర నాయక్ తదితరులు పాల్గొన్నారు.

జ్ఞానంతోనే జీవితంలో గొప్ప మార్పు సాధ్యం: కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



సూర్యాపేట, అక్టోబర్ 27 – సందేశం టైమ్స్ జిల్లా కోఆర్డినేటర్ సోమయ్య కంభంపాటి: జ్ఞానంతోనే మనిషి జీవితంలో గొప్ప మార్పు సాధ్యమవుతుందని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. మహర్షి వాల్మీకి జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. మహర్షి వాల్మీకి జయంతిని పురస్కరించుకుని సూర్యాపేట జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ, సాధారణ స్థాయి నుంచి ఉన్నత స్థాయికి ఎదగడానికి జ్ఞానం ఎంతో అవసరమని, దానిని ఆచరణలో పెట్టినప్పుడే వ్యక్తిగతంగా, సామాజికంగా సానుకూల మార్పులు సాధ్యమవుతాయని వివరించారు. వ్యక్తుల్లో మార్పు వచ్చినప్పుడే సమాజంలోనూ మార్పు వస్తుందని పేర్కొన్నారు. మహర్షి వాల్మీకి జీవితం నుంచి కరుణ, దయ, మానవత్వం వంటి ఉన్నత విలువలను ప్రతి ఒక్కరూ నేర్చుకోవాలని సూచించారు. మనుషులతో పాటు పశుపక్ష్యాదులకు కూడా జీవించే హక్కు ఉందని, ప్రతి జీవిపట్ల ప్రేమతో, దయతో వ్యవహరించాలని కోరారు. వేల సంవత్సరాల క్రితం వెలువడిన రామాయణం నేటికీ ప్రజలకు మార్గదర్శకంగా నిలుస్తోందని, కాలానుగుణంగా సాంకేతికతలో మార్పులు వచ్చినప్పటికీ మానవ విలువలు శాశ్వతంగా నిలిచిపోతాయని అన్నారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షిస్తూ భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమలోని చెడు లక్షణాలను తగ్గించుకుని సత్ప్రవర్తన, మంచి గుణాలను పెంపొందించుకోవాలని, అప్పుడే జిల్లా, రాష్ట్రం, దేశం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతాయని పేర్కొన్నారు. మహర్షి వాల్మీకి జయంతి సందర్భంగా జిల్లా ప్రజలకు కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, జిల్లా రెవెన్యూ అధికారి ప్రేమ్ రాజ్, బీసీ సంక్షేమ అధికారి విశాల్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పెండెం వెంకటరమణతో పాటు పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.



గురునానక్ మందిర్ కమాన్ల నిర్మాణానికి జగ్గారెడ్డి భూమిపూజ

సంగారెడ్డి, అక్టోబర్ 27 – సందేశం టైమ్స్ స్టేట్ కోఆర్డినేటర్ బి. సంగమేశ్వర్: గత గురునానక్ జయంతి సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు సంగారెడ్డి పట్టణంలోని బ్రాహ్మణవాడలో గురునానక్ మందిర్‌కు సంబంధించిన రెండు కమాన్ల నిర్మాణానికి కాంగ్రెస్ నాయకుడు జగ్గారెడ్డి సోమవారం భూమిపూజ చేశారు. గురునానక్ మందిర్‌కు వెళ్లే ప్రవేశ మార్గంలో ఒక కమాన్‌తో పాటు మందిర్ సమీపంలోని భవాని మందిర్ రోడ్డులో మరో కమాన్ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. అంతకుముందు గురునానక్ మందిర్‌ను సందర్శించిన జగ్గారెడ్డి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా మందిర్ ప్రతినిధులు తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకురాగా, వాటిని త్వరలో పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మందిర్ ప్రాంగణంలోని రావిచెట్టు కింద ఉన్న నాగదేవత ఆలయాన్ని అభివృద్ధి చేయాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత్ కిషన్‌కు సూచించారు. ప్రస్తుతం ఉన్న విగ్రహాలను యథాస్థానంలోనే ఉంచి అభివృద్ధి పనులు చేపట్టాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిక్కు ప్రముఖులు డాక్టర్ సర్దార్ సురేందర్ గోపి సింగ్, సర్దార్ తేజేందర్ సింగ్, సర్దార్ స్వరణ్ సింగ్, సర్దార్ సత్‌పాల్ సింగ్, డాక్టర్ సర్దార్ భరత్ సింగ్, సిక్కు గురువు గురుదేవ్ సింగ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత్ కిషన్, మున్సిపల్ చైర్‌పర్సన్ కూన వనిత సంతోష్, నాయకులు బొంగుల రవి, కూన సంతోష్, మహేష్ ముదిరాజ్, శ్రీహరి, సుదీప్, నరేన్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.





పోక్సో చట్టంపై విద్యార్థులకు అవగాహన.. నేరాలకు పాల్పడితే కఠిన శిక్షలు

నర్సాపూర్, అక్టోబర్ 27 – సందేశం టైమ్స్ ప్రతినిధి: బాలలపై లైంగిక నేరాలకు పాల్పడితే పోక్సో చట్టం ప్రకారం నేర తీవ్రతను బట్టి కఠిన శిక్షలు విధిస్తారని సీనియర్ న్యాయవాది సి.హెచ్. స్వరూపరాణి తెలిపారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, మెదక్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు నర్సాపూర్ మండల్ లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో, న్యాయమూర్తి ఎం. హేమలత సూచనల ప్రకారం నర్సాపూర్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం ఉదయం ప్రార్థనా సమయంలో పోక్సో చట్టంపై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న స్వరూపరాణి విద్యార్థులకు చట్టంలోని ముఖ్యాంశాలను వివరించారు. 18 సంవత్సరాల లోపు బాలబాలికలపై లైంగిక వేధింపులు లేదా ఇతర లైంగిక నేరాలకు పాల్పడితే నేర స్వభావం, తీవ్రతను బట్టి చట్టపరమైన చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు. బాలలపై లైంగిక వేధింపులు లేదా ఇతర నేరాలు జరిగినట్లు తెలిసిన వెంటనే పోలీసులకు లేదా సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని, చెడు మార్గాలకు దూరంగా ఉంటూ క్రమశిక్షణ, పట్టుదలతో చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని పిలుపునిచ్చారు. బాలల భద్రత, గౌరవం, హక్కులను పరిరక్షించడంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సామ్య నాయక్, ఉపాధ్యాయులు, లీగల్ సర్వీసెస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నర్సాపూర్ సమీపంలో రోడ్డు ప్రమాదం.. యువకుడు మృతి, మరొకరికి తీవ్ర గాయాలు



నర్సాపూర్, అక్టోబర్ 27(సందేశం టైమ్స్ ప్రతినిధి): మెదక్ జిల్లా నర్సాపూర్ మండల పరిధిలోని పెద్దచింతకుంట గ్రామ శివారులో అక్టోబర్ 25వ తేదీ రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో చిలిప్‌చెడ్ మండలం సమ్లా తండాకు చెందిన మాలోత్ వినోద్ (23) మృతి చెందగా, బానోత్ సర్దార్ (30) తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల వివరాల ప్రకారం.. వినోద్ తన స్నేహితుడు సర్దార్‌తో కలిసి ఫోటో ఆల్బమ్ అందించేందుకు ద్విచక్ర వాహనంపై నర్సాపూర్‌కు బయలుదేరాడు. రాత్రి సుమారు 11:10 గంటల సమయంలో పెద్దచింతకుంట గ్రామ శివారులోని జల హనుమాన్ చికెన్ షాప్ సమీపంలో మెదక్ నుంచి హైదరాబాద్ వైపు ఇనుప రాడ్ల లోడుతో వెళ్తున్న లారీ వెనుక భాగాన్ని వారి ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వినోద్‌కు తలతో పాటు శరీరంలోని పలు భాగాల్లో తీవ్ర గాయాలయ్యాయి. సర్దార్ కూడా గాయపడటంతో క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో నర్సాపూర్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా వినోద్ మృతి చెందాడు. సర్దార్‌కు ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం మరో ఆసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి మాలోత్ వాసురాం ఇచ్చిన ఫిర్యాదులో లారీలోని ఇనుప రాడ్లు వెనుకవైపు నుంచి బయటకు పొడుచుకొని ఉండటంతో పాటు, డ్రైవర్ నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే ప్రమాదం జరిగిందని ఆరోపించారు. ఈ ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్ పిండి అంజనేయులుపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్న వాసురాంకు ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉండగా, చిన్న కుమారుడైన వినోద్ మృతితో సమ్లా తండాలో విషాదం నెలకొంది. వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తూ అప్రమత్తంగా ప్రయాణించాలని పోలీసులు సూచించారు.

నర్సాపూర్‌లో భార్య, కుమారుడు అదృశ్యం.. ఆచూకీ కోసం పోలీసుల గాలింపు



నర్సాపూర్, అక్టోబర్ 27 (సందేశం టైమ్స్ ప్రతినిధి): మెదక్ జిల్లా శివంపేట మండలం గూడూరు గ్రామానికి చెందిన గుడెపు శివకుమార్ (24) తన భార్య చిట్యాల రేణుక (23), 12 నెలల కుమారుడు గుడెపు బాన్విక్ కనిపించడం లేదని నర్సాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసుల వివరాల ప్రకారం.. ఈ నెల 25న కుమారుడి పుట్టినరోజు సందర్భంగా శివకుమార్ భార్య రేణుక, కుమారుడు బాన్విక్, అక్క గుడెపు సుశీలతో కలిసి షాపింగ్ కోసం నర్సాపూర్‌కు వచ్చారు. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ఓ స్వీట్ షాప్ వద్ద సుశీలను వేచి ఉండమని చెప్పిన రేణుక, కొంత పని ఉందంటూ కుమారుడిని తీసుకుని వెళ్లి తిరిగి రాలేదు. ఆమెకు ఫోన్ చేసినా స్పందన లేకపోవడంతో సుశీల అదే రోజు సాయంత్రం శివకుమార్ కుటుంబ సభ్యులకు సమాచారం అందించింది. బంధువుల ఇళ్లు, అత్తవారి ఇల్లు, పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో శివకుమార్ అక్టోబర్ 26న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి తల్లి, చిన్నారి ఆచూకీ కోసం గాలింపు చేపట్టారు. కనిపించకుండా పోయిన రేణుక ఎత్తు సుమారు 5 అడుగుల 1 అంగుళం కాగా, గుండ్రని ముఖం, తెల్లని శరీర ఛాయ కలిగి ఉంది. ఆమె అదృశ్యమైన సమయంలో నీలం రంగు చీర, జాకెట్ ధరించి ఉంది. చిన్నారి బాన్విక్ ఎరుపు రంగు షర్టు, ప్యాంటు ధరించి ఉన్నాడు. వారి ఆచూకీ తెలిసినవారు సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.



సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా వాల్మీకి జయంతి వేడుకలు.. మహర్షి చిత్రపటానికి నివాళులర్పించిన ఎస్పీ నరసింహ

సూర్యాపేట, అక్టోబర్ 27(సందేశం టైమ్స్ జిల్లా కోఆర్డినేటర్): సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ కె. నరసింహ ఐపీఎస్ వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించగా, పోలీసు అధికారులు, సిబ్బంది కూడా మహర్షికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వాల్మీకి మహర్షి జీవితం, ఆదర్శాలు, సమాజానికి ఆయన అందించిన విలువైన సందేశాలను స్మరించుకున్నారు. మహర్షి రచించిన రామాయణం భారతీయ సంస్కృతి, నైతిక విలువలు, ధర్మం, సత్యనిష్ఠకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. వాల్మీకి మహర్షి ఆశయాలను ఆదర్శంగా తీసుకొని సమాజంలో నైతిక విలువలను పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, డీఎస్పీ నరసింహ చారి, ఇన్స్పెక్టర్లు రామారావు, శివకుమార్, రాజశేఖర్, నాగేశ్వరరావు, వెంకటయ్య, ఆర్ఐలు ప్రవీణ్ కుమార్, జానయ్య, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



మహర్షి వాల్మీకి జీవితం సమాజానికి స్ఫూర్తిదాయకం: కలెక్టర్ ప్రతిమా సింగ్

మెదక్, అక్టోబర్ 27 (సందేశం టైమ్స్ ప్రతినిధి): మెదక్ కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ జ్యోతి ప్రజ్వలన చేసి, వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వాల్మీకి రచించిన రామాయణం ధర్మం, సత్యం, న్యాయం, కర్తవ్యనిష్ఠ వంటి విలువలను బోధిస్తుందని పేర్కొన్నారు. పట్టుదల, జ్ఞానం, కృషితో మనిషిలో మార్పు సాధ్యమని, మహర్షి బోధనలను ఆదర్శంగా తీసుకొని సమాజంలో సద్భావన, సమానత్వం, నైతిక విలువలను పెంపొందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, జిల్లా రెవెన్యూ అధికారి అంబాదాస్ రాజేశ్వర్, బీసీ సంక్షేమ శాఖ అధికారి ఉపేందర్, బీసీ సంఘం నాయకులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.



అర్హులైన పేదలకు సంక్షేమ పథకాల ఫలాలు అందాలి.. పక్కా ఇళ్ల నిర్మాణమే లక్ష్యం: ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు

మెదక్, అక్టోబర్ 27 (సందేశం టైమ్స్ ప్రతినిధి): మెదక్ నియోజకవర్గంలో అర్హులైన పేద కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందించడమే లక్ష్యంగా ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు ఆధ్వర్యంలో సోమవారం వివిధ ప్రాంతాల్లో పంపిణీ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళ్యాణలక్ష్మి చెక్కులు, స్మార్ట్ రేషన్ కార్డులతో పాటు ఇందిరమ్మ ఇళ్ల రెండో విడతలో ఎంపికైన లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు ప్రొసీడింగ్స్ అందజేశారు. నార్సింగి మండలంలోని రైతు వేదికలో నాలుగు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు చెక్కులు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద కుటుంబాలకు ఆర్థిక, సామాజిక భరోసా కల్పించడంతో పాటు మహిళల సంక్షేమం, ఆహార భద్రత, సొంతింటి కల సాకారం చేయడానికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అనంతరం చిన్న శంకరంపేట మండలంలోని రాదేశాం ఫంక్షన్ హాల్‌లో ఇందిరమ్మ ఇళ్ల రెండో విడతలో ఎంపికైన లబ్ధిదారులకు మంజూరు ప్రొసీడింగ్స్ అందజేశారు. పూరి గుడిసెల్లో నివసిస్తున్న నిరుపేద కుటుంబాలకు పక్కా ఇళ్లు నిర్మించి గౌరవప్రదమైన జీవనం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు.



వాల్మీకి జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయం.. తప్పులను సరిదిద్దుకుంటే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చు: ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు

మెదక్, అక్టోబర్ 27 (సందేశం టైమ్స్ ప్రతినిధి): మహర్షి వాల్మీకి జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఐపీఎస్ అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన వాల్మీకి జయంతి వేడుకల్లో ఆయన మహర్షి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ తొలినాళ్లలో రత్నాకరుడిగా దారి దోపిడీలకు పాల్పడిన వాల్మీకి, సప్తర్షుల బోధనలతో ఆత్మపరిశీలన చేసుకుని తన జీవితాన్ని మార్చుకున్నారని తెలిపారు. కఠోర తపస్సుతో మహర్షిగా ఎదిగి రామాయణాన్ని రచించి ధర్మం, సత్యం, న్యాయం, మానవతా విలువలను ప్రపంచానికి చాటిచెప్పారని పేర్కొన్నారు. చేసిన తప్పులను గుర్తించి సరిదిద్దుకుంటూ సన్మార్గంలో నడిస్తే జీవితంలో గొప్ప మార్పు సాధ్యమవుతుందని వాల్మీకి జీవితం నిరూపిస్తోందన్నారు. ఆయన బోధనలను ఆదర్శంగా తీసుకుని సత్ప్రవర్తనతో జీవిస్తూ సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, డీఎస్పీ రంగనాథ్, ఆర్ఐ శైలేందర్, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.





ప్రజా ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి.. వృద్ధుల సమస్యలకు ప్రత్యేక ప్రాధాన్యం: మెదక్ ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు

మెదక్, అక్టోబర్ 27 (సందేశం టైమ్స్ ప్రతినిధి): ప్రజావాణిలో అందిన ప్రతి ఫిర్యాదుపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి బాధితులకు సత్వర న్యాయం అందించాలని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించి వారి సమస్యలను నేరుగా తెలుసుకున్నారు. భూ వివాదాలు, కుటుంబ సమస్యలు, ఆర్థిక మోసాలు, వేధింపులకు సంబంధించిన ఫిర్యాదులను పరిశీలించి, ప్రతి అంశంపై సమగ్ర విచారణ జరిపి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. పరిష్కారంలో జాప్యం చేయకుండా విచారణ పురోగతిని బాధితులకు ఎప్పటికప్పుడు తెలియజేయాలని స్పష్టం చేశారు. వృద్ధుల పట్ల నిర్లక్ష్యం లేదా వేధింపులకు పాల్పడితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ, వారి సమస్యలను ప్రత్యేక ప్రాధాన్యంతో పరిశీలించి త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలకు నాణ్యమైన, పారదర్శకమైన పోలీసు సేవలు అందిస్తూ జవాబుదారీతనంతో వ్యవహరించాలని, సమస్యలకు సత్వర పరిష్కారం చూపి పోలీసు శాఖపై ప్రజల నమ్మకాన్ని పెంపొందించేలా పనిచేయాలని ఎస్పీ సూచించారు.

ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రతి అంశాన్ని పక్కాగా నమోదు చేయాలి: రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి

సూర్యాపేట, అక్టోబర్ 27 (సందేశం టైమ్స్ జిల్లా కోఆర్డినేటర్ సోమయ్య కంభంపాటి): ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో ప్రతి అంశాన్ని పారదర్శకంగా, పక్కాగా నమోదు చేయాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా, సూర్యాపేట సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి తేజస్ నంద్ లాల్ పవార్ సంబంధిత అధికారులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) కింద వివరాలు కోరినప్పుడు వెంటనే అందించేందుకు అవసరమైన రికార్డులు, ధ్రువీకరణ పత్రాలు, ఆధారాలను భద్రపరచాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో మిగిలి ఉన్న సుమారు 4.50 లక్షల పనులను మూడు నుంచి నాలుగు రోజుల్లో, ఈ వారం చివరి నాటికి పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న నోటీసుల విచారణను త్వరితగతిన పూర్తి చేయాలని, అనర్హులుగా గుర్తించిన దరఖాస్తులకు సంబంధించి సరైన కారణాలు, ఆధారాలను పక్కాగా నమోదు చేయాలని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 50 వేల దరఖాస్తులను అనర్హమైనవిగా గుర్తించగా, వాటిలో 44 వేల దరఖాస్తులకు సంబంధించిన ప్రక్రియను తుది దశకు తీసుకువచ్చినట్లు తెలిపారు. ఫారం-6, ఫారం-7 దరఖాస్తులకు సంబంధించిన పెండింగ్ పనులను నవంబర్ 5వ తేదీలోగా పూర్తి చేయాలని సూచించారు. ఎల్ఓ, ఏఎల్ఓ, ఈఆర్ఓ, బీఎల్ఓ స్థాయిల్లో భౌతిక, ఆన్‌లైన్ రికార్డులను భద్రంగా నిర్వహించాలని, భవిష్యత్తులో న్యాయపరమైన వివాదాలు లేదా ఆర్టీఐ దరఖాస్తులు వచ్చినప్పుడు అవసరమైన సమాచారం, ఆధారాలను వెంటనే అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ మాట్లాడుతూ, జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించిన పెండింగ్ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని, పెండింగ్ నోటీసుల విచారణను వేగవంతం చేసి ప్రతి దరఖాస్తుకు సంబంధించిన వివరాలు, ఆధారాలను సక్రమంగా నమోదు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ బి. హరిసింగ్, డీఆర్వో ప్రేమ్ రాజు, కోదాడ, హుజూర్‌నగర్ ఆర్డీవోలు సూర్యనారాయణ, శ్రీనివాసులు, తహసీల్దార్లు సాయి గౌడ్, రాజేందర్ తదితర ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

ఎస్ఐఆర్–2026 ప్రక్రియను గడువులోగా పూర్తి చేయాలి: రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి





మెదక్, అక్టోబర్ 27 (సందేశం టైమ్స్ ప్రతినిధి): ఎస్ఐఆర్–2026 ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. ఓటరు దరఖాస్తుల పరిష్కారం, సంబంధిత రికార్డుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. సోమవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్ఐఆర్–2026 అమలుపై సమీక్షించారు. ఈ సమావేశానికి మెదక్ సమీకృత కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రతిమా సింగ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ ఎస్ఐఆర్‌కు సంబంధించిన అన్ని నోటీసులపై చర్యలను వచ్చే వారంలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. అనర్హులుగా గుర్తించిన ఓటర్ల జాబితాకు సంబంధించిన వివరాలను తగిన ఆధారాలతో నమోదు చేయాలని సూచించారు. తిరస్కరణకు గురైన దరఖాస్తుల విషయంలో కారణాలను స్పష్టంగా పేర్కొంటూ స్పీకింగ్ ఆర్డర్లు జారీ చేయాలని తెలిపారు. ఫారం–6, ఫారం–7, ఫారం–8 దరఖాస్తులను నవంబర్ 5వ తేదీలోగా పరిష్కరించాలని స్పష్టం చేశారు. బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు), సహాయ ఎన్నికల నమోదు అధికారులు ఎస్ఐఆర్–2026కు సంబంధించిన రికార్డులను పకడ్బందీగా నిర్వహించి భద్రపరచాలని ఆదేశించారు. శాసనమండలి నియోజకవర్గాల ఓటర్ల జాబితా తయారీలో పారదర్శకత పాటించాలని, ఫారం–18 దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సూచించారు.



సీఎంఆర్ బకాయిలను సన్న బియ్యం రూపంలో చెల్లించాలి: అదనపు కలెక్టర్ నగేష్

మెదక్, అక్టోబర్ 27 (సందేశం టైమ్స్ ప్రతినిధి): సీఎంఆర్ బకాయిల చెల్లింపులు, పెండింగ్ బియ్యం డెలివరీల విషయంలో రైస్ మిల్లర్లు నిర్లక్ష్యం వహించరాదని మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ స్పష్టం చేశారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో టాస్క్‌ఫోర్స్ డీఎస్పీ శ్రీధర్ రెడ్డి అధ్యర్యంలో రైస్ మిల్లుల యాజమాన్యాలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, కేఎంఎన్ 2014-15 నుంచి ఖరీఫ్ 2024-25 వరకు పెండింగ్‌లో ఉన్న సీఎంఆర్ బకాయిలను, రబీ 2022-23 సీజన్‌కు సంబంధించి వేలం వేసిన ధాన్యాన్ని మినహాయించి, ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు నన్న బియ్యం రూపంలో తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థకు తప్పనిసరిగా అందజేయాలని ఆదేశించారు. బియ్యానికి బదులుగా ధాన్యం విలువకు సమానమైన మొత్తాన్ని చెల్లించే సందర్భంలో నిర్దేశించిన 125 శాతం మొత్తంతో పాటు ఒప్పందం ప్రకారం 12 శాతం వడ్డీ, పెనాల్టీ చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. రబీ 2022-23 సీజన్‌లో వేలం వేసిన ధాన్యానికి సంబంధించిన బకాయిలను తక్షణమే చెల్లించాలని, ప్రభుత్వ ఉత్తర్వుల్లో పేర్కొన్న 45 రోజుల గడువులోగా బకాయిలను పరిష్కరించుకోవాలని సూచించారు. రబీ 2024-25 సీజన్‌కు సంబంధించిన పెండింగ్ సీఎంఆర్ బియ్యంతో పాటు కేఎంఎన్ 2025-26 ఖరీఫ్, రబీ సీజన్ల బియ్యాన్ని నిర్దేశించిన లక్ష్యాల ప్రకారం నిర్ణీత గడువులోగా ఎఫ్‌సీఐకి డెలివరీ చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ ఉత్తర్వులు, ఒప్పంద నిబంధనలు పాటించకుండా బకాయిలు చెల్లించని, పెండింగ్ బియ్యం డెలివరీలను గడువులోగా పూర్తి చేయని మిల్లర్లపై నిబంధనల ప్రకారం కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇప్పటికే చేపట్టిన లేదా చేపట్టనున్న చర్యలు యథావిధిగా కొనసాగుతాయని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి నిత్యానందం, జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ జగదీష్, ఇతర అధికారులు, జిల్లా రైస్ మిల్లుల యజమానులు పాల్గొన్నారు.

భూ రీ-సర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలి: తహసీల్దార్ కరుణశ్రీ



చింతకాని, అక్టోబర్ 27 – సందేశం టైమ్స్ ప్రతినిధి: ఖమ్మం జిల్లా చింతకాని మండలం చిన్నమండవ గ్రామంలో నిర్వహిస్తున్న భూ రీ-సర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కరుణశ్రీ సూచించారు. గ్రామ సర్పంచ్ పర్చ రామచంద్రరావుతో కలిసి రైతులకు రీ-సర్వేపై అవగాహన సదస్సు నిర్వహించిన ఆమె మాట్లాడుతూ, గ్రామంలోని భూముల సరిహద్దులను ముందుగా పరిశీలించి, సర్వేకు సంబంధించిన సమాచారాన్ని రైతులకు ముందుగానే తెలియజేస్తామని తెలిపారు. సర్వే నిర్వహించే సమయంలో రైతులు తప్పనిసరిగా తమ భూముల వద్ద హాజరై రెవెన్యూ సిబ్బందికి సహకరించాలని కోరారు. భూ సరిహద్దుల విషయంలో భవిష్యత్తులో ఎలాంటి వివాదాలు తలెత్తకుండా, సర్వే ప్రక్రియలో తప్పులు దొర్లకుండా గ్రామస్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రీ-సర్వే పూర్తయిన అనంతరం నిబంధనల ప్రకారం అర్హులైన రైతులకు నూతన పట్టాదారు పాస్‌బుక్కులు మంజూరు చేస్తామని పేర్కొన్నారు. అనంతరం చిన్నమండవ, పోలంపల్లి గ్రామాల మధ్య ఉన్న భూ సరిహద్దులను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పర్చ రామచంద్రరావు, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, రెవెన్యూ అధికారి షేక్ లాల్ జాన్ పాషా, రెవెన్యూ సర్వేయర్ నవీన్, రైతులు మరిదు లక్ష్మీనారాయణ, మోర్ల కృష్ణ, మరిదు రామకృష్ణ, కాశీమాల వేణు, పర్చగని బ్రహ్మం, గుండ్ల చంటి, గుండ్ల నాగరాజు, గుండ్ల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

నీరు, విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాలి: కలెక్టర్ ప్రతిమా సింగ్



మెదక్, అక్టోబర్ 27 – సందేశం టైమ్స్ ప్రతినిధి: ఎల్‌నినో ప్రభావాన్ని సమర్థంగా ఎదుర్కొనేందుకు నీరు, విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాలని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులకు సూచించారు. రానున్న రోజుల్లో తాగునీరు, విద్యుత్ కొరత ఏర్పడే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని కలెక్టరేట్‌తో పాటు జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో వనరుల వృథాను అరికట్టేందుకు అధికారులు, ఉద్యోగులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, కార్యాలయాల్లో అవసరం లేనప్పుడు ఫ్యాన్లు, లైట్లు ఆపివేయాలని, నీటిని అవసరమైన మేరకే వినియోగించాలని సూచించారు. నీటి సంరక్షణ, విద్యుత్ పొదుపు ప్రతి ఒక్కరి బాధ్యతగా గుర్తించాలని, ఇప్పటి నుంచే పొదుపు చర్యలు పాటిస్తే భవిష్యత్తు తరాలకు అవసరమైన వనరులను కాపాడగలమని పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో వనరుల వినియోగంపై అధికారులు నిరంతరం దృష్టి సారించాలని తెలిపారు. అలాగే ప్రభుత్వ ఉద్యోగుల హాజరు నమోదుకు రూపొందించిన నూతన 'మీ ప్రమాణం' యాప్‌లో ప్రతి ఉద్యోగి తప్పనిసరిగా హాజరు నమోదు చేసుకోవాలని ఆదేశించారు. ఉద్యోగుల హాజరు నమోదును సంబంధిత శాఖల జిల్లా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, వచ్చే శనివారం లోగా ఉద్యోగులందరూ యాప్‌లో నమోదు చేసుకునేలా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ నగేష్, జిల్లా రెవెన్యూ అధికారి అంబాదాస్ రాజేశ్వర్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



పెండింగ్ ఎస్ఐఆర్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి: కలెక్టర్ ప్రతీక్ జైన్

సంగారెడ్డి, అక్టోబర్ 27 (సందేశం టైమ్స్ ప్రతినిధి): ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేసి, అర్హులైన ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా, ఎలాంటి తప్పులకు తావులేకుండా ఓటరు జాబితాను సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతి, ఫారం-6, 7, 8 దరఖాస్తుల పరిష్కారం, పెండింగ్ పనులపై సమీక్షించారు. సంగారెడ్డి కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్లు టి.ఎల్. సంగీత, ఆర్. పాండు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, ఫారం-6, 7, 8 దరఖాస్తులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో తప్పుగా మ్యాపింగ్ అయిన ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల ప్రకారం వారి అర్హతలను నిర్ధారించాలని తెలిపారు. అనర్హులుగా గుర్తించిన ఓటర్ల విషయంలో అందుకు గల కారణాలను స్పష్టంగా నమోదు చేయడంతో పాటు, సంబంధిత ఆధారాలు, పూర్తి వివరాలను రికార్డుల్లో భద్రపరచాలని సూచించారు. అనర్హులుగా గుర్తించిన ఓటర్ల వివరాలను మరోసారి పునఃపరిశీలించి, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఓటరు జాబితా సవరణలో పారదర్శకత, నిబంధనల అమలు, ఖచ్చితత్వానికి ప్రాధాన్యతనిస్తూ పెండింగ్ పనులన్నింటినీ సకాలంలో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

బాలల భద్రత, హక్కులపై విద్యార్థులకు న్యాయ అవగాహన



సంగారెడ్డి, అక్టోబర్ 27 – సందేశం టైమ్స్ ప్రతినిధి: బాలల భద్రత, హక్కులు, రక్షణ, సంక్షేమంపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, సంగారెడ్డి ఆధ్వర్యంలో 'సురక్షిత్ బచ్పన్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని పలు పాఠశాలల్లో న్యాయ అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రథమ అదనపు జిల్లా, సెషన్స్ న్యాయమూర్తి కె. జయంతి సంగారెడ్డిలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో, మూడవ అదనపు జిల్లా, సెషన్స్ న్యాయమూర్తి మాధవి కృష్ణ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బాలల హక్కులు, రక్షణపై అవగాహన కల్పించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. సౌజన్య పెద్దాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు సదాశివపేటలోని ప్రభుత్వ రవీంద్ర మోడల్ పాఠశాల, ప్రభుత్వ న్యూ హైస్కూల్‌లో కార్యక్రమాలు నిర్వహించారు. అదనపు సీనియర్ సివిల్ జడ్జి దీప్తి సంగారెడ్డిలోని బీవీఎం హైస్కూల్‌లో విద్యార్థులకు వ్యక్తిగత భద్రత, బాలల హక్కులు, రక్షణ చర్యల గురించి వివరించారు. బాలలపై లైంగిక వేధింపుల నివారణ, గుడ్ టచ్–బ్యాడ్ టచ్, ఆన్‌లైన్ భద్రత, బాలల అక్రమ రవాణా, దోపిడీ వంటి నేరాల నుంచి రక్షణ పొందే మార్గాలపై అవగాహన కల్పించారు. ఏదైనా అసురక్షిత పరిస్థితి ఎదురైతే భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పోలీసు అధికారులు లేదా బాలల రక్షణ అధికారులను సంప్రదించి సహాయం పొందాలని సూచించారు. బాలల భద్రత విషయంలో పాఠశాలల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని, పిల్లల హక్కులను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యతని న్యాయమూర్తులు పేర్కొన్నారు. బాలలకు సురక్షితమైన వాతావరణం కల్పించేందుకు తల్లిదండ్రులు, విద్యాసంస్థలు, పోలీసు శాఖ, న్యాయ సేవాధికార సంస్థ సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ప్రతి బాలుడు, బాలిక భద్రతతో జీవిస్తూ, స్వేచ్ఛగా విద్యను అభ్యసించి, గౌరవప్రదమైన వాతావరణంలో ఎదిగే హక్కు కలిగి ఉన్నారని పేర్కొన్నారు. బాలల హక్కుల పరిరక్షణ, వారిపై జరిగే నేరాల నివారణ, సురక్షిత బాల్యాన్ని ప్రోత్సహించే దిశగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అవగాహన కార్యక్రమాలను కొనసాగిస్తుందని వెల్లడించారు.

ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారంలో అధికారులు చొరవ చూపాలి: కలెక్టర్ ప్రతీక్ జైన్




సంగారెడ్డి, అక్టోబర్ 27 – సందేశం టైమ్స్ ప్రతినిధి: ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అందిన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల ప్రకారం సత్వరమే పరిష్కరించాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. సోమవారం సంగారెడ్డి కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్ సంగీతతో కలిసి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల అర్జీలను స్వీకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదుల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. ప్రజావాణికి వచ్చే ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించి, సమస్యకు సంబంధించిన వాస్తవాలను నిర్ధారించిన అనంతరం నిబంధనల మేరకు పరిష్కరించాలని స్పష్టం చేశారు. అనవసర జాప్యం లేకుండా బాధితులకు సత్వర న్యాయం అందేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆదేశించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 49 ఫిర్యాదులు అందాయి. వీటిలో సంగారెడ్డి డివిజన్ నుంచి 9, నారాయణఖేడ్ డివిజన్ నుంచి 2, జహీరాబాద్ డివిజన్ నుంచి 3, కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి 35 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. అందోల్ డివిజన్ నుంచి ఒక్క ఫిర్యాదు కూడా అందలేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



తుల్జాపూర్ భవానీమాత క్షేత్రానికి 240 కిలోమీటర్ల పాదయాత్ర.. పవన్ కుమార్‌కు అభినందనలు

రాయికోడ్, అక్టోబర్ 27 – సందేశం టైమ్స్ ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండలం కర్చల్ గ్రామానికి చెందిన దాడువై పవన్ కుమార్ విజయదశమి సందర్భంగా మహారాష్ట్రలోని ప్రసిద్ధ తుల్జాపూర్ భవానీమాత క్షేత్రానికి చేపట్టిన 240 కిలోమీటర్ల సాహస పాదయాత్రను విజయవంతంగా పూర్తి చేసి సోమవారం స్వగ్రామానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా పీపాడ్‌పల్లి గ్రామ మాజీ సర్పంచ్ లక్ష్మీ అనిల్ కుమార్, రాయికోడ్ మండల వీరశైవ లింగాయత్ లింగబలిజ సంఘం కోశాధికారి పీపాడ్‌పల్లి అనిల్ కుమార్ కర్చల్ గ్రామానికి చేరుకుని పవన్ కుమార్‌కు అభినందనలు తెలిపి శుభాకాంక్షలు అందజేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ లక్ష్మీ అనిల్ కుమార్ మాట్లాడుతూ, యువగళం గ్రామ మిత్రబృందం ఆశీస్సులతో పవన్ కుమార్ దృఢ సంకల్పంతో పాదయాత్ర ప్రారంభించి, మార్గమధ్యంలో ఎన్ని కష్టాలు ఎదురైనా లక్ష్యాన్ని చేరుకునే దిశగా అవిశ్రాంతంగా ముందుకు సాగారని కొనియాడారు. రోజుకు సగటున 40 నుంచి 50 కిలోమీటర్ల మేర నడుస్తూ కేవలం నాలుగు రోజుల్లో తుల్జాపూర్ భవానీమాత క్షేత్రానికి చేరుకోవడం అభినందనీయమని పేర్కొన్నారు. ఎండను సైతం లెక్కచేయకుండా పట్టుదల, సహనం, ఆత్మవిశ్వాసంతో పాదయాత్రను పూర్తి చేయడం యువతకు స్ఫూర్తిదాయకమని అన్నారు. పవన్ కుమార్ సాధించిన ఈ విజయాన్ని గ్రామస్థులు అభినందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని మంచి కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు.



కోదాడలో జర్నలిస్టుల ఆత్మీయ సమ్మేళనం.. సందేశం టైమ్స్ సీఈఓ మెదక్ జిల్లా అధ్యక్షులు వినోద్ కుమార్‌కు ఘన సన్మానం

కోదాడ, అక్టోబర్ 27 (సందేశం టైమ్స్ ప్రతినిధి): తెలుగు జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోదాడ నియోజకవర్గ జర్నలిస్టుల ఆత్మీయ సమ్మేళనం, నూతన జర్నలిస్టులకు ప్రాథమిక శిక్షణ తరగతులు, జర్నలిజం విలువలపై అవగాహన సదస్సు వేమూరి సుధాకర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా సందేశం టైమ్స్ సీఈఓ వినోద్ కుమార్‌ను తెలుగు జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ తరఫున జనరల్ సెక్రటరీ శెట్టి వెంకటేశం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తెలుగు జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ టి. సంగమేశ్వర్, ప్రచార కార్యదర్శి కె. సంగమేశ్వర్, రాష్ట్ర ముఖ్య సలహాదారు బి. సంగమేశ్వర్, రాష్ట్ర కార్యదర్శి మన్నె నాగయ్య, సంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి సీహెచ్. బస్వరాజ్, సందేశం టైమ్స్ మెదక్ జిల్లా ఇన్‌చార్జి అనిల్ కుమార్, నాగరాజు, రవీందర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ జర్నలిస్టులు వృత్తి విలువలను కాపాడుతూ, బాధ్యతాయుతంగా వార్తలను సేకరించి ప్రజలకు వాస్తవ సమాచారాన్ని అందించాలని సూచించారు. నూతన జర్నలిస్టులు ప్రాథమిక శిక్షణ పొందుతూ జర్నలిజం నైతిక విలువలకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు.

చికెన్ కర్రీలో గోరు కనిపించిందన్న ఫిర్యాదు.. పుల్కల్‌లో హోటల్ సీజ్



పుల్కల్, అక్టోబర్ 27 – సందేశం టైమ్స్ ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండల కేంద్రంలోని 'మన ఊరి రుచులు' హోటల్‌పై ఆహార నాణ్యత, పరిశుభ్రతకు సంబంధించి ఫిర్యాదులు రావడంతో అధికారులు తనిఖీలు చేపట్టారు. ఫుడ్ ఇన్స్పెక్టర్ రాజేశ్వర్ సోమవారం హోటల్‌ను తనిఖీ చేసి, నిబంధనల ప్రకారం సీజ్ చేసినట్లు సమాచారం. సుమారు 15 రోజుల క్రితం హోటల్ నుంచి తీసుకెళ్లిన చికెన్ కర్రీలో గోరు కనిపించిందని ఓ వినియోగదారుడు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. అదేవిధంగా బిర్యానీ నాణ్యత, ఆహార పదార్థాల తయారీలో పరిశుభ్రతపై కూడా వినియోగదారులు అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. ఈ ఫిర్యాదుల నేపథ్యంలో అధికారులు హోటల్ వంటగది పరిశుభ్రత, ఆహార పదార్థాల తయారీ, నిల్వ విధానాలను పరిశీలించినట్లు తెలిసింది. ఆహార పదార్థాల తయారీ, విక్రయాల్లో ఆహార భద్రతా నిబంధనలు, పరిశుభ్రత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, నిర్లక్ష్యం వల్ల వినియోగదారుల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లకుండా సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని స్థానికులు కోరుతున్నారు. అయితే హోటల్‌ను సీజ్ చేయడానికి సంబంధించిన పూర్తి వివరాలు, అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.



పోలీస్ ఫ్లాగ్ డే వారోత్సవాల్లో భాగంగా పోలీసులకు వ్యాసరచన పోటీలు

సంగారెడ్డి, అక్టోబర్ 27(సందేశం టైమ్స్ ప్రతినిధి): పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ సంగారెడ్డి జిల్లాలో నిర్వహిస్తున్న పోలీస్ ఫ్లాగ్ డే వారోత్సవాల్లో భాగంగా పోలీసు అధికారులు, సిబ్బందికి సోమవారం సంగారెడ్డిలోని శాంతినగర్ సెయింట్ ఆంథోనీ ఉన్నత పాఠశాలలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోలీసు వ్యవస్థను బలోపేతం చేయడం, ప్రజలకు మెరుగైన సేవలు అందించడం, పోలీసుల విధులు, బాధ్యతలపై అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా పోటీలు నిర్వహించినట్లు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపీఎస్ తెలిపారు. అధికారులకు ప్రజల మన్ననలు పొందేందుకు చేయాల్సిన కృషి, కింది స్థాయి పోలీసు వ్యవస్థను బలోపేతం చేయడం వంటి అంశాలపై, సిబ్బందికి ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలు పోలీసుల నుంచి ఆశించే సేవలు, పోలీసుల జీవితాల్లో సోషల్ మీడియా పాత్ర వంటి అంశాలపై పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మొత్తం 34 మంది పాల్గొన్నారని, ఉత్తమ ప్రతిభ కనబరిచిన మూడు వ్యాసాలను ఎంపిక చేసి విజేతలకు రివార్డులు అందజేయనున్నట్లు ఎస్పీ వెల్లడించారు. అదేవిధంగా విద్యార్థులకు ఆన్‌లైన్‌లో వ్యాసరచన పోటీలు నిర్వహించి, సోషల్ మీడియా దుర్వినియోగాన్ని అరికట్టడంలో పోలీసుల పాత్ర, తెలంగాణను మాదకద్రవ్యాల రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో విద్యార్థుల బాధ్యత, సైబర్ నేరాల నివారణలో పోలీసులు–ప్రజల పాత్ర, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాల్సిన అవసరం వంటి అంశాలను అందించారు. పోలీసు సిబ్బంది, విద్యార్థుల్లో సామాజిక బాధ్యతను పెంపొందించడంతో పాటు పోలీసు వ్యవస్థపై ప్రజలకు అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమని ఎస్పీ పేర్కొన్నారు.



స్కౌట్ మాస్టర్లు, గైడ్ కెప్టెన్లకు శిక్షణ కార్యక్రమం

సందేశం టైమ్స్ ప్రతినిధి: భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ తెలంగాణ అసోసియేషన్ ఆధ్వర్యంలో పెద్దపల్లి, నిర్మల్, రాజన్న సిరిసిల్ల జిల్లాలకు చెందిన స్కౌట్ మాస్టర్లు, గైడ్ కెప్టెన్లకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో ఆయా జిల్లాల నుంచి శిక్షణార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్టేట్ ట్రైనింగ్ కమిషనర్ మోహన్ రావు, కోర్సు లీడర్ ఎం. గిరిజాదేవి, స్టాఫ్ సభ్యులు అమరజ్యోతి, సోలోమన్, కార్యదర్శి మాధవరెడ్డి, జిల్లా కార్యదర్శి, కోశాధికారి సుందర్ రావు, కమిషనర్ అంజా గౌడ్, ట్రైనింగ్ కమిషనర్ చంద్రశేఖర్ గౌడ్, లింగంపల్లి రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సురభి చైతన్య, గైడ్ విభాగం స్టాఫ్ సభ్యులు ధనలక్ష్మి, సుజాత, ప్రమీల పాల్గొన్నారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని జెండర్ ఈక్వెటీ కోఆర్డినేటర్ సునీత ఖన్నా సందర్శించి కార్యక్రమం నిర్వహణను పరిశీలించారు.

ఘనంగా సందేశం టైమ్స్ స్టేట్ బ్యూరో ప్రతినిధి కుమారుడు దీక్షిత్ పటేల్ జన్మదిన వేడుకలు





వట్టపల్లి, అక్టోబర్ 27 (సందేశం టైమ్స్ మెదక్ జిల్లా ఇన్‌చార్జి): సంగారెడ్డి జిల్లా వట్టపల్లి గ్రామంలో సందేశం టైమ్స్ న్యూస్ స్టేట్ బ్యూరో ప్రతినిధి కార్చల్ సంగమేశ్వర్ కుమారుడు చిన్నారి దీక్షిత్ పటేల్ జన్మదిన వేడుకలను కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, సన్నిహితుల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బంధువులు, శ్రేయోభిలాషులు చిన్నారికి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆశీర్వదించారు. దీక్షిత్ పటేల్ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని, విద్యా, విజ్ఞాన రంగాల్లో రాణిస్తూ తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. పెద్దల ఆశీస్సులతో ఉన్నత లక్ష్యాలను సాధించి భవిష్యత్తులో మంచి వ్యక్తిగా ఎదగాలని శుభాకాంక్షలు తెలిపారు. చిన్నారి జన్మదిన వేడుకలతో కుటుంబంలో ఆనందోత్సాహాలు నెలకొన్నాయి.



ఈ నెల 27న ఖేలో ఇండియా వాలీబాల్ సెలక్షన్ ట్రయల్స్

సంగారెడ్డి, అక్టోబర్ 27 – సందేశం టైమ్స్ ప్రతినిధి: ఖేలో ఇండియా ఆధ్వర్యంలో ఉమ్మడి మెదక్ జిల్లా అండర్-17 బాలబాలికల వాలీబాల్ సెలక్షన్ ట్రయల్స్ ఈ నెల 27న సంగారెడ్డి జిల్లా దౌల్తాబాద్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉదయం 9 గంటల నుంచి నిర్వహించనున్నట్లు ఖేలో ఇండియా ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి అంజా గౌడ్ తెలిపారు. వాలీబాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా స్టీరింగ్ కమిటీ సభ్యులు ప్రమోద్ కుమార్ రెడ్డి, ఎం.డి. షాజియా ఆదేశాల మేరకు ఈ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సెలక్షన్ ట్రయల్స్‌లో పాల్గొనదలచిన బాలబాలికలు ఆధార్ కార్డు, బోనఫైడ్ సర్టిఫికెట్, పదో తరగతి ఉత్తీర్ణత ధ్రువీకరణ పత్రాలను తప్పనిసరిగా వెంట తీసుకురావాలని సూచించారు. 2009 జనవరి 1వ తేదీ తర్వాత జన్మించిన వారు మాత్రమే ఈ ఎంపికలకు అర్హులని స్పష్టం చేశారు. అర్హత కలిగిన క్రీడాకారులు నిర్ణీత సమయానికి హాజరై సెలక్షన్ ట్రయల్స్‌లో పాల్గొనాలని అంజా గౌడ్ కోరారు.



ఉద్యోగులకు 42 శాతం ఫిట్‌మెంట్‌తో రెండో పీఆర్సీ అమలు చేయాలి

సూర్యాపేట, అక్టోబర్ 27 – సందేశం టైమ్స్ ప్రతినిధి: తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం సూర్యాపేట జిల్లా శాఖ కార్యవర్గ సమావేశం సోమవారం సాయంత్రం శంకర్ విలాస్‌లోని నీటిపారుదల శాఖ భవనంలో జిల్లా అధ్యక్షుడు ఎన్. భూపాల్ రెడ్డి, కార్యదర్శి భూక్య పాండు నాయక్ ప్రారంభంలో నిర్వహించారు. ఈ సమావేశంలో ఉద్యోగుల సమస్యలు, సంఘం కార్యకలాపాలపై విస్తృతంగా చర్చించి పలు తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. తెలంగాణ ఉద్యోగుల పీఆర్సీ నివేదికను తెప్పించి 42 శాతం ఫిట్‌మెంట్‌తో రెండో పీఆర్సీని వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. 2027 సంవత్సరానికి సంబంధించిన వాల్ క్యాలెండర్లు, టేబుల్ క్యాలెండర్లు, డైరీల తయారీ ప్రక్రియను ప్రారంభించి, ప్రకటనల సేకరణతో పాటు అన్ని ప్రచురణలు ఒకే నమూనాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. 2026 సంవత్సరానికి సంబంధించిన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నవంబర్‌లోగా పూర్తిచేయాలని తీర్మానించారు. ప్రభుత్వం, ఉద్యోగుల వాటాలను సమాన నిష్పత్తిలో నిర్ధారించి ఉద్యోగుల ఆరోగ్య పథకం (ఈహెచ్ఎస్) విధివిధానాలను పూర్తిస్థాయిలో వెంటనే అమలు చేయాలని, కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని (సీపీఎస్) రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని (ఓపీఎస్) పునరుద్ధరించాలని కోరారు. 2025 జనవరి 1, జూలై 1, 2026 జనవరి 1 నుంచి పెండింగ్‌లో ఉన్న మూడు విడతల కరువు భత్యాన్ని (డీఏ) వెంటనే విడుదల చేయాలని తీర్మానించారు. జిల్లా కార్యవర్గంలో ఖాళీ అయిన స్థానాలు, బదిలీల కారణంగా ఏర్పడిన ఖాళీల భర్తీకి డి. లింగా నాయక్, డి. మల్లేశంలను ఉపాధ్యక్షులుగా, వి. రెబకను పబ్లిక్ సెక్రటరీగా ఎన్నుకోవడాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు. ఉద్యోగుల సంక్షేమం, హక్కుల పరిరక్షణకు సంఘం ఐక్యంగా కృషి చేయాలని సమావేశంలో నిర్ణయించారు.

సూర్యాపేట జిల్లాలో 28 ఎంఎల్‌హెచ్‌పీ పోస్టుల మెరిట్ జాబితా విడుదల

సూర్యాపేట, అక్టోబర్ 27 – సందేశం టైమ్స్ ప్రతినిధి: సూర్యాపేట జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్ఎం) కార్యక్రమం కింద కాంట్రాక్ట్ పద్ధతిలో భర్తీ చేయనున్న 28 మెడికల్ ఆఫీసర్ (ఎంఎల్‌హెచ్‌పీ) పోస్టులకు సంబంధించి ఎంబీబీఎస్, బీఏఎంఎస్ అభ్యర్థుల ప్రొవిజనల్ మెరిట్ జాబితాను విడుదల చేసినట్లు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి తెలిపారు. ఈ జాబితాపై అభ్యంతరాలు ఉన్న అభ్యర్థులు తమ అభ్యంతరాలను అక్టోబర్ 28, 2026లోపు సమర్పించాలని సూచించారు. అభ్యంతరాలను అన్ని పని దినాల్లో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సూర్యాపేట ఐడీఓసీలోని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి కార్యాలయం, ఎఫ్-25లో అందజేయాలని పేర్కొన్నారు. మెరిట్ జాబితా, ఇతర పూర్తి వివరాల కోసం అభ్యర్థులు సూర్యాపేట జిల్లా అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.



రోడ్డు ప్రమాద బాధితులకు తక్షణ వైద్యం అందించాలి: కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

సూర్యాపేట, అక్టోబర్ 27 – సందేశం టైమ్స్ ప్రతినిధి: రోడ్డు ప్రమాద బాధితులకు సత్వర వైద్య సేవలు అందించి విలువైన ప్రాణాలను కాపాడటమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం రహత్ (PM RAHAT), రహ్‌వీర్ (Rah-Veer) పథకాలను జిల్లాలో సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అధికారులను ఆదేశించారు. సోమవారం సూర్యాపేట జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా ఎస్పీ నరసింహతో కలిసి నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు క్షతగాత్రులకు ఎలాంటి జాప్యం లేకుండా అత్యవసర వైద్య సేవలు అందించేందుకు గుర్తించిన ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పీఎం రహత్ పథకం కింద అర్హులైన రోడ్డు ప్రమాద బాధితులకు గరిష్ఠంగా రూ.1.50 లక్షల వరకు నగదు రహిత వైద్య చికిత్స అందించే అవకాశం ఉందని, పథకం నిబంధనల ప్రకారం ప్రమాదం జరిగిన తేదీ నుంచి గరిష్ఠంగా ఏడు రోజుల వరకు చికిత్స పొందవచ్చని వివరించారు. అత్యవసర సహాయం కోసం 112 లేదా 108 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు. సూర్యాపేట జిల్లాలో మొత్తం 38 ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులను ఈ పథకం కోసం గుర్తించామని, ప్రమాద బాధితులను వీలైనంత త్వరగా సమీపంలోని గుర్తించిన ఆసుపత్రికి తరలించి అవసరమైన చికిత్స అందేలా చూడాలని ఆదేశించారు. రహ్‌వీర్ పథకం గురించి ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని, రోడ్డు ప్రమాద బాధితులను గోల్డెన్ అవర్‌లో ఆసుపత్రికి చేర్చి ప్రాణాలు కాపాడే వారికి నిబంధనల ప్రకారం రూ.25 వేల నగదు ప్రోత్సాహకం, ప్రశంసాపత్రం అందించే అవకాశం ఉందని తెలిపారు. అర్హత ప్రమాణాల ప్రకారం ఏడాదిలో ఒక వ్యక్తి గరిష్ఠంగా ఐదుసార్లు ప్రోత్సాహకం పొందవచ్చని, జాతీయ స్థాయిలో ఎంపికైన పది మందికి ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున అవార్డులు అందించే అవకాశం ఉందని వివరించారు. ప్రమాద బాధితులకు సహాయం చేసే పౌరులకు చట్టపరమైన రక్షణ కల్పించే నిబంధనలు ఉన్నందున, ప్రజలు ఎలాంటి భయం లేకుండా క్షతగాత్రులకు సహాయం చేసేందుకు ముందుకు రావాలని కోరారు. జిల్లా ఎస్పీ నరసింహ మాట్లాడుతూ జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపడుతోందని, ప్రమాదాలు ఎక్కువగా జరిగే బ్లాక్ స్పాట్లను గుర్తించి సంబంధిత శాఖలతో కలిసి నివారణ చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వాహనదారులు రహదారి భద్రతా నిబంధనలు పాటిస్తూ బాధ్యతాయుతంగా వాహనాలు నడపాలని సూచించారు. ప్రమాదాలకు కారణమయ్యే అంశాలను గుర్తించి వాటిని నివారించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్, ఎస్పీ స్పష్టం చేశారు. సమావేశంలో అదనపు కలెక్టర్ బి. హరిసింగ్, డీఆర్వో ప్రేమ్‌రాజ్, ఆర్టీఓ పురుషోత్తం రెడ్డి, డీపీఓ యాదగిరి, డీఎంహెచ్‌ఓ డాక్టర్ పి. వెంకటరమణ, ఎన్‌హెచ్-65 అధికారులు, ఆర్డీవోలు శ్రీనివాసులు, సూర్యనారాయణ, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు రవితేజ, అనూష, జీజీహెచ్ సూపరింటెండెంట్ శ్రవణ్, గుర్తించిన ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల వైద్యులు, యాజమాన్యాలు, పోలీస్ అధికారులు, సంబంధిత శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.



ఓటరు జాబితా సవరణలో పారదర్శకత, ఖచ్చితత్వం పాటించాలి: రోల్ అబ్జర్వర్ దేవసేన

సూర్యాపేట, అక్టోబర్ 27 – సందేశం టైమ్స్ ప్రతినిధి: సూర్యాపేట జిల్లాలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా సమర్థవంతంగా, పారదర్శకంగా నిర్వహించాలని రోల్ అబ్జర్వర్ దేవసేన అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌తో కలిసి ఆమె ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఓటర్ల నుంచి స్వీకరించిన దరఖాస్తులు, వాటి పరిశీలన, ప్రాసెసింగ్, ధ్రువీకరణ పత్రాలు, సంబంధిత రికార్డుల నిర్వహణపై జిల్లా ఎన్నికల అధికారి, ఓటరు నమోదు అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి దరఖాస్తును ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలు, నిబంధనలకు అనుగుణంగా క్షుణ్ణంగా పరిశీలించాలని, దరఖాస్తుల్లో పేర్కొన్న వివరాలు, సమర్పించిన ధ్రువీకరణ పత్రాలు, సంబంధిత రికార్డులను జాగ్రత్తగా తనిఖీ చేసి అర్హతకు అనుగుణంగా తదుపరి చర్యలు చేపట్టాలని సూచించారు. దరఖాస్తుల పరిశీలన, ప్రాసెసింగ్‌లో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను గుర్తించి నిర్దేశిత విధానాల ప్రకారం పరిష్కరించాలని ఆదేశించారు. ఓటర్ల వివరాల ధ్రువీకరణలో పారదర్శకత, ఖచ్చితత్వం పాటించడంతో పాటు ఎస్ఐఆర్‌కు సంబంధించిన ఫారాలు, ధ్రువీకరణ పత్రాలు, ఇతర రికార్డులను సక్రమంగా భద్రపరచాలని తెలిపారు. దరఖాస్తుల స్థితిగతులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ప్రక్రియను వేగవంతం చేయాలని, జిల్లా ఎన్నికల అధికారి, సంబంధిత ఓటరు నమోదు అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని దేవసేన స్పష్టం చేశారు. సమావేశంలో అదనపు కలెక్టర్ బి. హరిసింగ్, డీఆర్వో ప్రేమ్‌రాజ్, కోదాడ ఆర్డీవో సూర్యనారాయణ, హుజూర్‌నగర్ ఆర్డీవో శ్రీనివాసులు, సి-సెక్షన్ సూపరింటెండెంట్ రాజేందర్ రెడ్డి, తహసీల్దార్లు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు రవితేజ, అనూష తదితరులు పాల్గొన్నారు.



అర్నాబ్ తుఫాన్ బీభత్సం.. ఏపీ తీరానికి ముప్పు.. 53 రైళ్లు రద్దు

విశాఖపట్నం, అక్టోబర్ 27 – సందేశం టైమ్స్ ప్రతినిధి: బంగాళాఖాతంలో ఏర్పడిన అర్నాబ్ తుఫాన్ క్రమంగా బలపడుతూ ఆంధ్రప్రదేశ్ తీరంవైపు దూసుకొస్తుండటంతో రాష్ట్రంలో అప్రమత్తత పెరిగింది. అక్టోబర్ 28 ఉదయం బాపట్ల నుంచి విశాఖపట్నం మధ్య, యానాంకు సమీపంలో తుఫాన్ తీరం దాటే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ అంచనా వేయడంతో తీరప్రాంత జిల్లాల్లో ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టారు. తుఫాన్ తీరం దాటే సమయంలో గంటకు 115 నుంచి 125 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీచే అవకాశం ఉండగా, గాలుల వేగం అప్పుడప్పుడు గంటకు 140 కిలోమీటర్ల వరకు చేరవచ్చని వాతావరణ శాఖ హెచ్చరించింది. భారీ వర్షాలు, ఈదురుగాలులు, సముద్ర అలల ఉద్ధృతి కారణంగా తీరప్రాంతాల్లోని లోతట్టు ప్రాంతాలకు ముప్పు పొంచి ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా కాకినాడ పరిసరాలు, యానాం ప్రాంతాల్లో సముద్రపు నీరు తీరప్రాంతాల్లోకి చొచ్చుకొచ్చే ప్రమాదం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. తుఫాన్ ప్రభావం ఆంధ్రప్రదేశ్‌కే పరిమితం కాకుండా దక్షిణ ఒడిశా, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్‌తో పాటు మరికొన్ని ప్రాంతాల్లోనూ వర్షాల రూపంలో కనిపించే అవకాశం ఉంది. ఈ పరిస్థితుల్లో ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యమిస్తూ రైల్వే శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. అక్టోబర్ 27, 28 తేదీల్లో ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ మార్గాల్లో నడవాల్సిన 53 రైలు సర్వీసులను ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా రద్దు చేసినట్లు వార్తా నివేదికలు వెల్లడించాయి. రద్దయిన రైళ్లలో రాజమండ్రి–విజయవాడ, విజయవాడ–మచిలీపట్నం, మచిలీపట్నం–గుడివాడ, కాకినాడ పోర్టు–విశాఖపట్నం, విశాఖపట్నం–కాకినాడ పోర్టు, పార్వతీపురం–విశాఖపట్నం, విశాఖపట్నం–పార్వతీపురం మార్గాల్లోని సర్వీసులు ఉన్నాయి. అలాగే విజయవాడ–నరసాపురం, నరసాపురం–రాజమండ్రి, విజయవాడ–కాకినాడ పోర్టు, రాజమండ్రి–విశాఖపట్నం, విజయవాడ–భీమవరం, భీమవరం–నిడదవోలు, గుంటూరు–రేపల్లె, కాకినాడ పోర్టు–రాజమండ్రి తదితర మార్గాల్లోనూ రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడనుంది. ఈ రద్దుల కారణంగా విజయవాడ, గుంటూరు, రాజమండ్రి, కాకినాడ, భీమవరం, నరసాపురం, విశాఖపట్నం, పార్వతీపురం ప్రాంతాల మధ్య ప్రయాణించే వేలాది మంది ప్రయాణికులు తమ ప్రయాణ ప్రణాళికలను మార్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడవచ్చు. మరోవైపు, కొన్ని ఇతర రైళ్లను రద్దు చేయడం లేదా వాటి ప్రయాణాన్ని మధ్యలోనే ముగించడం, ప్రారంభ స్టేషన్‌ను మార్చడం వంటి చర్యలు కూడా చేపట్టినట్లు రైల్వే సంబంధిత వార్తా నివేదికలు పేర్కొన్నాయి. తుఫాన్ ప్రభావం దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం కూడా అప్రమత్తమైంది. కేంద్ర ప్రభుత్వ సమీక్షలో తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలకు అవసరమైన ఏర్పాట్లు, ఆశ్రయ కేంద్రాలు, తరలింపు చర్యలు సిద్ధం చేసినట్లు అధికారులు వివరించారు. మత్స్యకారులు అక్టోబర్ 29 వరకు సముద్రంలోకి వెళ్లవద్దని హెచ్చరికలు జారీ చేశారు. తీరప్రాంత ప్రజలు వాతావరణ శాఖ, జిల్లా యంత్రాంగం సూచనలను తప్పనిసరిగా పాటించాలని, బలమైన గాలులు వీచే సమయంలో చెట్లు, విద్యుత్ స్తంభాలు, హోర్డింగుల సమీపంలో ఉండవద్దని, అత్యవసర పరిస్థితుల్లో అధికారుల సహాయం తీసుకోవాలని సూచిస్తున్నారు. రైలు ప్రయాణికులు తమ రైలు నంబరు, ప్రయాణ తేదీని పరిశీలించి, స్టేషన్‌కు బయలుదేరే ముందు అధికారిక రైల్వే విచారణ కేంద్రాలు లేదా రైల్వే వెబ్‌సైట్‌లో తాజా సమాచారాన్ని నిర్ధారించుకోవాలి. తుఫాన్ తీరం దాటిన తర్వాత కూడా భారీ వర్షాలు, వరదనీరు, రహదారులపై నీరు నిలిచిపోవడం వంటి సమస్యలు కొనసాగవచ్చు కాబట్టి ప్రజలు అప్రమత్తతను కొనసాగించడం అవసరం. తుఫాన్ తీవ్రత, దాని ప్రయాణ దిశలో మార్పులను వాతావరణ శాఖ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండగా, అధికారిక హెచ్చరికలను అనుసరించడం, అనవసర ప్రయాణాలను వాయిదా వేయడం, అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే బయటకు వెళ్లడం ద్వారా ప్రాణనష్టం, ఆస్తి నష్టాన్ని తగ్గించవచ్చని అధికారులు సూచిస్తున్నారు.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) రిజిస్ట్రేషన్ నం. : TGTEL/25/A0348 , టైటిల్ కోడ్ : Sandhesham Times.ప్రచురణ స్థలం :3- 82 వాయిల సింగారం, అనంతగిరి మండలం,సూర్యాపేట జిల్లా, తెలంగాణ – 508206, ప్రచురణకర్త (Publisher): మద్దినేని నాగేశ్వర రావు, సంపాదకులు (Editor) : కాసే అమృత,మొబైల్ : 9052045435, ఈ–మెయిల్ : sandeshamtimes@gmail.com, వెబ్‌సైట్ : www.sandeshamtimes.com,ముద్రణ (Printed at) : సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press)3-4297, సరస్వతి కాంప్లెక్స్, SVN కాలనీ, గుంటూరు,ఆంధ్రప్రదేశ్ – 522006.